సర్దార్ లచ్చన్నకు కేంద్ర మంత్రి ఘన నివాళులు

విశాలాంధ్ర-సోంపేట: స్వాతంత్ర సమరయోధుడు, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, ఉత్తరాంధ్రలో ఉద్యమాలకు ఊపిరిగా నిలిచి బడుగు వర్గాల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుని సర్దార్ బిరుదాంకితుడైన గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. సోంపేటలోని లచ్చన్న ఘాట్ వద్ద శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో లచ్చన్న తనయుడు, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీతో కలిసి లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న యువతకు ఒక స్ఫూర్తి ప్రధాత అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చిత్రాడ శ్రీనివాస్, జగదీష్ పట్నాయక్, బీన ఆనంద్, దేవాడ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

గోవా స్థాయిలో బారువా బీచ్

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం

ఇక్కడ బీచ్ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు

ఘనంగా ప్రారంభమైన ఫెస్టివల్

విశాలాంధ్ర-సోంపేట: దేశంలోనే ఉన్నతమైన సౌకర్యాలతో ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తోన్న గోవా తరహాలో బారువా బీచ్‌ను అభివృద్ధి చేయడానికి అపారమైన, అద్భుతమైన అవకాశాలు మెండుగా ఉన్నాయని కేంద్ర పౌర విమానయానశాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, పలువురు నేవీ అధికారులు పేర్కొన్నారు. ఇంత కాలం మరుగున పడిన బారువ వంటి బీచ్ అభివృద్ధికి తొలి అడుగు వేశామని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఒక అడుగు ముందుకేసి బారువ బీచ్‌ను తాను మినీ గోవాగా రూపొందిస్తానని ప్రతిజ్ఞ చేయడం విశేషం. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌తో కలిసి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్‌పి మహేశ్వర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి శనివారం వేకువజాము నుంచి ఆహ్లాదకరమైన బారువ తీరంలో బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా వేల సంఖ్యలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు. పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడే ఇటువంటి తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేకంగా ఓ విభాగం బారువ బీచ్‌లో పని చేస్తుండగా కొన్ని నెలల పాటు తాబేళ్ల గుడ్లను సేకరించి వాటిని పొదిగించి పిల్లలుగా రూపాంతరం చెందిన తర్వాత వాటిని సంరక్షించి ఈరోజు వాటిని సముద్రంలోకి విడిచిపెట్టి పర్యావరణ ప్రాధాన్యతను ప్రజలకు తెలియజెప్పారు. వందల ఏళ్ల క్రితం బారువ బీచ్ నుంచి సుమారు వందల మీటర్ల దూరంలో మునిగిపోయిన ఓ పడవ యొక్క ఆనవాళ్లు భారీ స్థాయిలో నిర్మించిన లైట్ హౌస్, దశాబ్ద కాలం క్రితం పర్యాటకులకు అనువుగా నిర్మించిన రిసార్ట్‌లు, విశాలమైన ఇసుక దిబ్బలతో కూడిన బారువ తీరం, చుట్టు విశాలమైన కొబ్బరితోటలు, అన్నింటికి మించి సముద్రంలో ఇదే ప్రాంతంలో కలుస్తున్న మహేంద్రతనయ నది ఇలా ఎన్నెన్నో అద్భుతమైన అందాల బారువ బీచ్‌కు బంగారు భవిష్యత్తు రాబోతుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది ఒక ట్రయల్ రన్ మాత్రమేనని మరో రెండు నెలల్లో ఇదే బారువ బీచ్‌లో ఫెస్టివల్ ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ రహిత బీచ్‌గా గుర్తింపు: బారువ తీరాన్ని ప్లాస్టిక్ రహిత బీచ్‌గా గుర్తింపు తీసుకు రావల్సిన అవసరం మనందరిపై ఉందని పేర్కొన్నారు. పర్యావరణానికి అతి ప్రమాదకరమైన ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నియంత్రించడంలో స్థానిక ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆలోచనతో రూపు దిద్దుకున్న ఈ కార్యక్రమాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జిల్లా ఉన్నతాధికారుల రాకతో బారువ బీచ్ శనివారం వేకువజాము నుంచే సందడి వాతావరణం నెలకొంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా బీచ్‌లో చెత్తను సేకరించి ప్రజలకు స్ఫూర్తి నింపారు. అలాగే సాహసక్రీడలను ఇష్టపడే వారి కోసం స్కూబా డైవింగ్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, జిల్లా కలెక్టర్‌తో పాటు ఏర్పాటులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పలాస ఆర్డీఓ వెంకటేష్, పలువురు జిల్లా అధికారులు, సోంపేట మండలానికి చెందిన అధికార యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం పాల్గొంది.

జేఈఈ మెయిన్స్ జాతీయస్థాయిలో 255 వ ర్యాంకు సాధించిన రోహిత్ దత్త

విశాలాంధ్ర-శ్రీకాకుళం: పట్టణం కల్కినగర్ కు చెందిన బందారు రోహిత్ దత్త 99.987 పర్సంటేజ్ మార్కులు సాధించి జేఈఈ మెయిన్స్ లో జాతీయస్థాయిలో ఓపెన్ క్యాటగిరిలో 255వ ర్యాంకు సాధించారు. విద్యాభ్యాసంలో చిన్నప్పటినుండి మంచి పట్టుదలతో మెరుగైన ఫలితాలు సాధించిన రోహిత్ దత్త ప్రాథమిక విద్యను స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలలో చదివారు. అనంతరం 9వ తరగతి నుండి విజయవాడ శ్రీ చైతన్య కళాశాలలో ఈ విద్యాభ్యాసం చేసి పదవ తరగతిలో 594 మార్కులు సాధించిన ఈయన ఇంటర్లో 984 మార్కులు సాధించారు. ఐ ఐ టి లో సి ఎస్ ఈ గ్రూపుకు తాను ప్రాధాన్యతను ఇస్తానని, విద్యాభ్యాసం అనంతరం కార్పోరేట్ వ్యాపార సంస్థను ప్రారంభించి నిరుద్యోగులకు ఉపాధిని కల్పించడమే తన ధ్యేయమని ఆయన తెలియజేశారు. కాగా ఈయన తండ్రి పివిఎస్ సాయిరాం ఉపాధ్యాయుడు కాగా తల్లి లక్ష్మీ ప్రసన్న ప్రణాళిక శాఖ జాయింట్ డైరెక్టర్ మరియు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిణిగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా రోహిత్ దత్తకు జేఈఈ మెయిన్స్ లో జాతీయస్థాయిలో ర్యాంకు రావడం పట్ల ఆయన కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రకై సహకారం అందించాలి

శానిటేషన్ ప్రోగ్రాంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పిలుపు

విశాలాంధ్ర-రణస్థలం: మండల కేంద్రంలో మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దానికోసమే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని, అలాగే మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛంద కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, ప్రతి నెలా మూడో శనివారం ఒక నినాదంతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పేర్కొన్నారు. రణస్థలం మండల కేంద్రంలో నిర్వహించిన శానిటేషన్ డే ప్రోగ్రాం లో ముఖ్య అతిథిగా హాజరై తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం జాతీయ రహదారి-16 పై మానవ హారం నిర్వహించి పరిసరాల పరిశుభ్రత నినాదాలు, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో ముచ్చటించి వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథం నాయుడు దుమ్ము అశోక్, రౌతు శ్రీనివాసరావు, సుంకర ధనుంజయరావు, మండపాక కనకరావు, గొర్లె లక్ష్మణరావు, దన్నాన సత్తిబాబు, డీజీఎం శ్రీనివాసరావు, దన్నాన చిరంజీవి, అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలి

ఐసిడిఎస్ పిఓ వసుంధర దేవి

విశాలాంధ్ర-మందస: గర్భిణులకు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికా హారం అందజేయాలని మందస ఐసిడిఎస్ పి ఓ కె.వసుంధర దేవి అన్నారు. శనివారం ఐ.సి.డి.యస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ పక్వాడా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రసన కార్యక్రమంలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం గర్భిణీలు చిన్నారులు తీసుకోవడం వలన కలిగే లాభాలు, పిల్లల ఎదుగుదల గూర్చి తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు బి. మంగమ్మ, సిహెచ్ వి రామలక్ష్మి, పి.జయలక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 98.16 పర్సెంటైజ్ సాధించిన రోహిత్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి/కోటబొమ్మాళి: శనివారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కోటబొమ్మాళికి చెందిన కమ్మకట్టు రోహిత్ రెడ్డి 98. 16 పర్సంటైల్ సాధించాడు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే చదువుకున్న రోహిత్ రెడ్డి ఇంటర్మీడియట్ లో విశాఖపట్నంలోని శ్రీ విశ్వ జూనియర్ కాలేజీలో చదువుకొని 1000 మార్కులకు గాను 967 సాధించాడు. ఇతని తండ్రి నరసింహులు రెడ్డి కోటబొమ్మాళి సి.ఆర్.ఎం.టి. గా పనిచేస్తున్నారు. తల్లి సుజాత గృహిణి. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థి చూపిన ప్రతిభ పై పలువురు అభినందిస్తున్నారు.

మండల సమావేశం నుండి వైసిపి సభ్యులు వాకౌట్

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: అధికారిక కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించకుండా వైసిపికి చెందిన ఎంపిటిసిలు, సర్పంచ్ లను గుర్తించడం లేదని ప్రతిపక్ష వైసిపి చెందిన ప్రతినిధులు ఆరోపించారు. మండల సర్వభసభ్య సమావేశం జరుగుతుండగా నిరసనగా మధ్యలో సభ నుండి వైసిపికి చెందిన సర్పంచ్ లు, ఎంపిటిసిలు వాకౌట్ చేసారు. శనివారం ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కోరం లేకపోవడంతో సభ కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. ముందుగా వ్యసాయం, విద్యుత్, హౌసింగ్ శాఖలకు సంబంధించి అంశాలపై చర్చ జరిగింది. ప్రోటోకాల్ పరించందుకు అందుకు నిరసనగా సభనుండి వాకౌట్ చేస్తూన్నట్లు ప్రకటిం చారు. దీనికి ఎంపిపి నీలవేణి మద్దతు తెలపడంతో ముకుమ్మడిగా సభ నుండి వాకౌట్ చేసారు. దీనిపై ఎంపిడిఓ ఎన్ రమేష్నాయుడు మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశంలో సభ్యులు వాకౌట్ చేయడం వలన సమస్యలు పరిష్కారం కావన్నారు. సమస్యలు ఏమైనా ఉం టే సభలో సభ్యులు ప్రస్తావిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే వైసిపికి చెందిన కోఆప్షన్ సభ్యుడు మరడ బాస్కరెడ్డి వాకౌట్ చేయకుండా సభలోనే ఉండిపోవడం విశేషం. కాగా అంతకు ముందు కోఆప్షన్ సభ్యుడు మరడ బాస్కర రెడ్డి -మాట్లాడుతూ బెండిగేటు. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రా%తీ%త్రివేళలల్లో విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే బెండిగేటు వద్ద ఉన్న హరిజన పేటకు విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఎంపిడిఓ ఎన్ రమేష్నాయుడు పశ వైద్యాధికారి మెట్ట పాపారావు, ఈఓఆర్డి తిరుమలరావు పాల్గొన్నారు.

మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న

లచ్చన్న చిత్రపటానికి పూలమాలు వేస్తున్న టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-పలాస: పేదల పక్షపాతి, బడుగు వర్గాల ఆశాజ్యోతి, మహనీ యుడు సర్దార్ గౌతు లచ్చన్న అని, ఆయన ఆశయాలను నేటి తరం నాయకులు కొనసాగించాలని పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు లొడగల కామేష్ యాదవ్‌లు అన్నారు. శనివారం గౌతు లచ్చన్న 19వ వర్ధంతి సందర్భంగా ముత్యాలమ్మకోనేరు వద్ద ఉన్న లచ్చన్న విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భౌతికంగా లచ్చన్న దూరమైనా ఆయన అడుగు జాడల్లో ప్రతీ ఒక్కరూ పయనిస్తూ ముందుకు సాగాలన్నారు. అలు పెరగని పోరాట యోధుడు, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతిగా అభివర్ణిస్తూ ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఉద్దాన ప్రాంత రైతుల సమస్యలపై ప్రత్యక్ష పోరాటాల ద్వారా పరిష్కరించిన ధీశాలని అన్నారు. లచ్చన్న ఆశయాలను నేటి యువత స్ఫూర్తిపొందాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి విఠల్, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, గాలి క్రిష్ణారావు, చంద్రశేఖర్ త్యాడి, టంకాల రవి. సప్ప నవీన్, డొక్కరి శంకర్, అంబటి క్రిష్ణమూర్తి, సత్యంలు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న బాటలో పయనించాలి

విశాలాంధ్ర-మందస: పీడిత ప్రజలు, రైతాంగం పక్షాన పోరాడిన సర్దార్ గౌతు లచ్చన్న ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచి పోయారని టీడీపీ మండల అధ్యక్షులు బావన దుర్యోదన, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి దాసరి తాతారావులు అన్నారు. శనివారం మందస, హరిపురం, బాలిగాం, అంబుగాం గ్రామాల్లో సర్దార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లచ్చన్న ఆశయ సాధన కోసం ఆయన బాటలో నేటి తరం పయనించాలని కోరారు. రైతు బాంధువుడు రైతుల కోసం ఇచ్ఛాపురం నుంచి మంద్రాసు వరకు పాదయాత్ర చేసిన ఏకైక నాయకుడు లచ్చన్న అని కొనియాడారు. కార్యక్రమంలో లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, బమ్మిడి కర్రెయ్య, రట్టి లింగరాజు, ఎం.నవీన్‌కుమార్, డి.తిరుపతి, ప్రకాష్ పాణిగ్రాహి, జి.లక్ష్మనారాయణ, బి.గున్నయ్య, భావన ఢిల్లేశ్వరరావు, కుప్పిలి వెంకటరావు, మామిడి తాతారావులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

నియోజకవర్గ శ్రీశయన సంఘ నాయకులు దేవ్

విశాలాంధ్ర-నరసన్నపేట: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, ప్రతిపక్ష మాజీ నాయకుడు, సర్దార్ గౌతు లచ్చన సేవలు చిరస్మరణీయమని, నియోజకవర్గ శ్రీ శయన సంఘం నాయకులు, టి.వి.చంద్రమోహన్ దేవ్ అన్నారు. శనివారం గౌతు లచ్చన్న 19వ వర్ధంతి సందర్భంగా స్థానిక జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో దివంగత లచ్చన్న చిత్రపటానికి దేవ్, శ్రీశయన సంఘం నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యసమరంలో, రాజకీయ రంగంలో నిస్వార్థంగా ఎనలేని సేవలు అందించిన లచ్చన్నను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం, శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి, దుబ్బ కోటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు గౌతు లచ్చన్న పేరు పెట్టాలని, లచ్చన్న జయంతి, వర్ధంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ శయన సంఘం నాయకులు, దంత త్రినాధరావు, సరిపల్లి మధు, వంజల రామరాజు, డొంకాన అసిరినాయుడు, కోల రాము, బతకల గోపి, డొంకాన మణి తదితరులు పాల్గొన్నారు.

27న విజయవాడలో గ్రంథాలయ పునర్వికాస సదస్సు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రాష్ట్రస్థాయి గ్రంథాలయ పునర్వికాస సదస్సు ఈనెల 27న విజయవాడ లో జరుగుతుందని, అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ఉద్యమ కమిటీ జిల్లా కన్వీనర్ బుడుమూరు సూర్యారావు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాకినేని బసవ పున్నయ్య భవన్ లో జరిగే సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత డాక్టర్ పెనుగొండ లక్ష్మీనారాయణ హాజరవుతారని, ఉద్యమ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ అధ్యక్షత వహిస్తారని వివరించారు. ప్రముఖ కవులు, కవయిత్రులు, కళాకారులు, ప్రచురణ సంస్థల ప్రతినిధులు సదస్సులో పాల్గొని, వివిధ అంశాలపై చర్చిస్తారని, రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ వ్యవస్థను పటిష్ట పరచడానికి సూచనలు చేస్తారని వారు తెలిపారు. స్వాతంత్ర ఉద్యమ కాలంలోనే, 19 16 లో ఆంధ్ర గ్రంథాలయ సంఘం విజయవాడలో ఏర్పాటయిందని, ప్రభుత్వ చట్ట ప్రకారం ప్రజలు గ్రంథాలయసెస్ చెల్లిస్తున్నారని, కానీ, ప్రభుత్వాలు ఆ నిధులను వేరే అవసరాలకు మళ్లించడం వల్ల గ్రంథాలయాల అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 1986 నుంచి ఈ దుస్థితి ప్రారంభిందని గుర్తు చేస్తూ, సమాజ పురోగమనంలో, స్వాతంత్ర ఉద్యమంలో అక్షరాస్యత, విద్యావంతుల చైతన్యం, గ్రంథాలయాల పాత్రను విస్మరించడం సరికాదన్నారు. వందేళ్ల తర్వాత మన రాష్ట్రంలో గ్రంథాలయాల పునర్వికాసం కోసం మరో ఉద్యమం చేపట్టక తప్పని పరిస్థితి రావడం వేదన కలిగిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం తప్ప ఈ ఉద్యమానికి మరో ఉద్దేశం లేదని వారు స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదని, రాజకీయాలకతీతంగా విజ్ఞానాన్ని అభిమానించే, ఆశించే వ్యక్తులు, సంస్థలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ ఉద్యమం పట్ల ఆసక్తి ఉన్నవారు విజయవాడ సదస్సుకు హాజరైతే, భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.

పౌష్టికాహార మాసోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ కేంద్రం పాతపట్నం పంచాయతీ కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాలును శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాతపట్నం నియోజవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు హాజరు అయి పాతపట్నం, కి సంబంధించిన అంగన్వాడీ కేంద్రాల గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేసి, సీమంతాలు నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు ఇంటి వద్ద తయారు చేసి తీసుకొవచ్చిన వివిధ పిండి వంటకాల స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించి వాటి రుచులను చూశారు. అనంతరం వాటిని గర్భిణులకు, బాలింతలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గర్భిణులకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందజేస్తే పుట్టిన పిల్లలకు అంగవైకల్యం సంక్రమించదన్నారు. అలాగే గర్భిణీలు ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో ఉంటే తన వంతు సహకారాలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. సిడిపిఒ విమలారాణి ,అంగన్వాడీ కార్యకర్తలు,గర్భిణీలు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యంతరాల నివృత్తి కోసమే గ్రామ సభ

విశాలాంధ్ర-ఆమదాలవలస: బలసల రేవు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు భూసేకరణలో రైతులకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్న తెలి యజేయాలని తహసీల్దార్ రాంబాబు తెలిపారు. ఆమదాలవలస మండలం ఇసుకల పేట గ్రామం లో శనివారం రెవిన్యూ గ్రామ సభను నిర్వహించా రు. గ్రామంలో నాగావళి నది తీరంలో బ్రిడ్జి కోసం అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరుగుతుందని, దానికి అవసరమైన భూసేకరణ పూర్తి చేసినట్లు తెలి యజేశారు. ఈ భూ సేకరణకు సంబంధించి రైతు లకు ఎటువంటి సందేహాలు, అభ్యంతరాలు ఉన్న ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావే శంలో ప్రత్యేక తహసిల్దార్ పి. శ్రీనివాసరావు, మండల సర్వే బొడ్డేపల్లి గోవిందరావు, రెవిన్యూ ఇన్స్పె క్టర్ పప్పల గోవిందరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులకు కావలసిన వస్తువులను మంజూరు చేయండి



విశాలాంధ్ర-టెక్కలి: గొర్రెల కాపరులకు కావలసిన వస్తువులను ఆదరణ యూనిట్ గా మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ యాదవ సంక్షేమం మరియు అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్ కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో 54 మందికి కార్పొరేషన్ కు చైర్మన్లు మరియు డైరెక్టర్లను నియమించిన విషయం అందరికీ తెలిసినదే. అయితే యాదవ కార్పొరేషన్ కు చైర్మన్ గా గొల్ల నరసింహ యాదవ్ ని మరియు 15 మంది డైరెక్టర్లను నియమించారు. ఈ సందర్భంగా విజయవాడ బీసీ భవనంలో యాదవ కార్పొరేషన్ మొదటి సమావేశాన్ని చైర్మన్ నరసింహ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో శ్రీకాకుళం జిల్లా యాదవుల తరఫున గొర్రెల కాపరులకు కావలసిన అవసరమైన వస్తువులు ఆదరణ యూనిట్ గా మంజూరు చేయాలని చైర్మన్ కు మరియు జాయింట్ డైరెక్టర్ కి వినత పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ద్వారా శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. ప్రతి జిల్లాలో, నియోజకవర్గ కేంద్రాలలో యాదవ రైతులకు భవనానికి తలం మరియు నిధులు కేటాయించాలని, పాలు ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు హెరిటేజ్తో ఒప్పందం చేసుకొని పాలు ఉత్పత్తిదారులకు మెరుగైన సదుపాయం కల్పించాలని, ప్రత్యేకంగా యాదవులకు రాయితీ రుణాలు, మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలు కొనుగోలు చేయుటకు మంజూరు చేయాలని, కాపర్లకు ఎండా వాన నుండి రక్షణ కోసం గొడుగులను మంజూరు చేయాలని, రాత్రి సమయాలలో వివిధ జంతువుల నుండే రక్షణ కోసం టార్చ్ లైట్లను ఇవ్వాలని, రాత్రి సమయంలో మంద వేసేటప్పుడు సైలాన్ వల అంచనాగా 20వేల రూపాయలు ఇవ్వాలని, ఇలా మరికొన్ని అవసరమైన వస్తువులను యాదవ కాపర్లకు అందజేయాలని జగదీశ్వరరావు కోరారు. జగదీష్ చెప్పిన డిమాండ్లకు చైర్మన్, జాయింట్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే యాదవ రైతులకు కావలసిన అవసరమైన వస్తువులను గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టిలో పెట్టి అన్ని విధాల అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

- బీసీల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న విశేష కృషి.
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.

విశాలాంధ్ర-టెక్కలి/కోటబొమ్మాళి: బడుగు, బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులు సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాక భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని పేర్కొన్నారు. లచ్చన్న వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘననివాళి అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బలహీన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రగతి, సంక్షేమం కోసం లచ్చన్న చేసిన ఉద్యమాలు చిరస్మరణీయం. ఆయన ఉత్తరాంధ్రుడు కావడం ఆ ప్రాంతం చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఎనలేని కృషిచేసిన ఆయనను నేటితరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పిస్తుట్లు తెలిపారు.

హత్యకు గురైన మహిళ

విశాలాంధ్ర-రణస్థలం: మండలం పైడి భీమవరం పంచాయతీ లో శనివారం సాయంత్రం పైడి భీమవరం జంక్షన్ పక్కనున్న చెరువులో ఆవుల భవాని 26 అనే మహిళ హత్య గురైనది గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఘటనకు పాల్పడ్డారు. ఘటన స్థలానికి జేఆర్ పురం సీఐ అవతారం ఎస్సై చిరంజీవి పరిశీలించారు. జేఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూపీ పాఠశాలలపై కొరడా ఝుళిపిస్తున్న కూటమి సర్కార్

- 1200 యూపీ పాఠశాలలు మూసివేతకు రంగం సిద్ధం
- ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి



విశాలాంధ్ర-గార: ప్రభుత్వ విద్యారంగాన్ని చక్కదిద్దుతు న్నామని ఒకపక్క ప్రకటనలు చేస్తూ ప్రతీ శుక్రవారం మీ అభ్యంతరాలను వినేందుకు మా అధికారులు మీకోసం ఎదురుచూస్తున్నారని పైకి తీయన మాటలు చెబుతూనే లోలోపల పాఠశాలలను కుదించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి అన్నారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత గార మండలం బలరామపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 3156 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా వాటిలో 700 ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూల్ గా ఉన్నతీకరణ చేసేందుకు అధికారులు నిర్ణయించారని, మరో 1200 యూపీ పాఠశాలలను యధావిధిగా ఎస్జీటీలతో కొనసాగిస్తామని ఇంకా మిగిలిన 1256 పాఠశాలలను ప్రైమరీగా డీగ్రేడ్ చేయనున్నామని గురువారం జరిగిన సమావేశంలో వెల్లడించారన్నారు. ఆయా పాఠశాలల్లో యూపీ తరగతులు బలవంతంగా తొలగిస్తున్నప్పుడు ఆయా పాఠశాలలో విద్యార్థులు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వారంతా సమీప ఉన్నత పాఠశాలలలోనే చేరుతారని ఎలా చెప్పగలమని, వారంతా ప్రైవేట్ బాట పట్టడానికి ప్రభుత్వమే అవకాశం కల్పించినట్లు ఉందన్నారు . అసలు బాలికల డ్రాపౌట్లను తగ్గించేందుకే యూపీలు ప్రవేశపెట్టారని మరి ఇప్పుడు బాలికలు విద్యకు ప్రాధాన్యత లేదా అని అధికారులను ప్రశ్నించారు. ఒకపక్క ఉన్నత పాఠశాలల నుండి ప్రాథమిక తరగతిలు వెనక్కి తీసుకొస్తూనే మరల హైస్కూల్లో మోడల్ ప్రైమరీ పాఠశాలలు నిర్వహించేలా ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎంతసేపూ ఎలా చేస్తే పాఠశాల తగ్గుతాయని ఏ విధంగానైతే పోస్టులు మిగులుతాయని ఆలోచన తప్ప నిజంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి వీరికి చిత్తశుద్ధి లేదన్నారు. ఇలా అయితే ముమ్ముందు కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా పాఠశాలల మూత వేసే ఆలోచన మానుకోవాలని, ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని, హైస్కూల్ తో సంబంధం లేకుండానే వేరుగానే మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉండేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.అశోక్ కుమార్,రామకృష్ణ, నీలమణి, విశ్వనాథం, యామిని ప్రియదర్శని మరియు అలుగోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆమదాలవలస పురపాలక సంఘం

ఇ-ప్రొక్యూరుమెంటు టెండరు నోటీసు

రేఖా నెం. 475/2021-ఇ1, తేది:17.04.2025

ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులకు ఇ-ప్రొక్యూరుమెంటు ద్వారా మూడవసారి టెండర్లు కోరబడుచున్నవి.

15వ ఆర్థిక సంఘం గ్రాంట్ పనులు	01	అంచనా కాంట్రాక్ట్ విలువ : 8,10,587/-

1	బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ చేయుటకు ప్రారంభ తేది:	19.04.2025, ఉ.గం.11.00 లకు
2	బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ చేయుటకు ఆఖరు తేది:	05.05.2025, మ. గం.1.00 లకు
3	బిడ్ స్వీకరించుటకు ఆఖరు తేది :	05.05.2025, మ. గం.3.00 లకు
4	బిడ్ తెరుచు తేది.	05.05.2025, సా. గం.4.00 లకు

ఇతర వివరములకు ఆఫీసు పనివేళల్లో సంబంధిత విభాగ అధికారులను సంప్రదించి తెలుసుకోవచ్చును.

కమిషనరు
ఆమదాలవలస పురపాలక సంఘం

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'చైతన్య' ప్రతిభ

విశాలాంధ్ర-నరసన్నపేట: పట్టణంలో మారుతీనగర్-4వీధికి చెందిన బొంతల వెంకట చైతన్య శనివారం విడుదలయిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో 4993వ ర్యాంక్ రాగా, ఓబిసిలో 1010వ ర్యాంక్ సాధించాడు. చైతన్య తండ్రి, బి.వి.రమణ, తల్లి, ఎల్లమ్మ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. చైతన్య విశాఖపట్నంలోని నారాయణ కాలేజ్‌లో చదువుతున్నారు. జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన చైతన్యకు విశాఖపట్నం నారాయణ కాలేజ్, ఏ.జి.ఎం, రమేష్, నరసన్నపేట నారాయణ స్కూల్, ప్రిన్సిపాల్, అల్లు రమేష్ అభినందనలు తెలియచేశారు.

21న ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి పరీక్ష

విశాలాంధ్ర-కవిటి: మండలంలో గల రాజపురం ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి పరీక్ష ఈనెల 21 సోమవారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం ఈశ్వరరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్లతో ఉదయం ఎనిమిది గంటలకు పరీక్షా కేంద్రం వద్దకు హాజరవ్వాలని కోరారు.

సంతబొమ్మాళిలో స్వచ్ఛ ఆంధ్ర

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంతబొమ్మాళి గ్రామపంచాయతీలో ఈ వేస్ట్ కలెక్షన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మండల ప్రత్యేక అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జయంతి ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో, సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి దుంపల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కె కాంతారావు, మెండ అప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన సీది సర్పంచ్

విశాలాంధ్ర-హిరమండలం/ పాతపట్నం: శనివారం పాతపట్నం మండలం,సీది గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి బోను గిరి తోపాటు సుమారు 100 కుటుంబాలకు పైగా పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో వైసీపీని వీడి టిడిపిలో చేరడం జరిగింది. రెడ్డి శాంతి నియంతృత్వ ధోరణితో విసిగి పోయామని, స్థానికులు, సేవా తత్పరులైన స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాతపట్నం నియోజకవర్గం కు చేస్తున్నటువంటి అభివృద్ధిని చూసి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. పార్టీలో చేరిన వారిని పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇస్తామని ఎమ్మెల్యే ఎం జి ఆర్ తెలియజేశారు.

నాణ్యమైన విద్య మా బాధ్యత

విశాలాంధ్ర-పోలాకి : నాణ్యమైన విద్య మా బాధ్యత అంటూ జిల్లా పరిషత్ బాలికున్నత పాఠశాల ఉపాధ్యాయులు పి.ఉమా కుమారి అన్నారు. శనివారం పోలాకి వెదుళ్ళవలస ఇందిరానగర్ గంగివలస మోగువిల్లిపేట చెల్లాయివలస తదితరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రైవేటు బడులు వద్దు ప్రభుత్వ బడులే ముద్దని ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని తల్లిదండ్రులను కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పిల్లలకు అన్ని సౌకర్యాలతో పాటు ఎటువంటి ఫీజులు లేకుండా పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హత ఉపాధ్యాయులు చే బోధన జరుగుతుందని అన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించమని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లలిత కుమారి ఉమా రాజేశ్వరి వి సుధారాణి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి

విశాలాంధ్ర-జలుమూరు: ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు చేర్పించాలని సారవకోట మండల విద్యాశాఖ అధికారి మద్దు వెంకటరమణ ప్రజలను కోరారు. శనివారం సారవకోట మండలం అలుదు గ్రామంలో నిర్వహించిన ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాల కోసం వివరించారు. అనంతరం స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ యేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పనులు గుర్తించండి

- అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-ఆమదాలవలస: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ సచివాలయాల ఇంజనీరింగ్ సిబ్బంది ప్రజలకు అవసరమైన అన్ని పనులు గుర్తించాలని ఎంపీపీ ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్ మూర్తి అన్నారు.ఆమ దాలవలస మండల పరిషత్ కార్యాలయంలో శని వారం ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు ఆధ్వర్యం లో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శనివారం సమీక్ష సమావేశం నిర్వ హించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక ఆహ్వానితులు, ఎంపీపీ ప్రతినిధి తమ్మినేని శ్రీరా మ్మూర్తి తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న పను లను పర్యవేక్షణ చేస్తూ, నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించాలని తెలిపారు. ఈ సమా వేశంలో డిప్యూటీ ఎంపీడీవో గోపాలరావు, మండల ఇంజనీర్ జ్యోతి పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు: ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న బడుగు బహీనవర్గాల ఆశాజ్యోతి అని మండల టిడిపి అధ్యక్షుడు సురాడ మోహనరావు అన్నారు.శనివారం లచ్చన్న 19 వర్ధంతి సందర్భంగా రెయ్యిపాడు లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి పార్టీ నాయకులతో కలిపి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన తో మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో తనదైన ముద్ర వేశారని అన్నారు.రైతుల కోసం ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకు పాదయాత్ర చేసిన రైతు భాంధవుడు సర్దార్ గౌతు లచ్చన్న అని ఆయన సేవలను కొనియాడారు.రాజకీయవేత్తగా నిబద్ధతతో కూడిన సేవలు అందించారని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సురాడ మోహనరావు,రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వర్ రావు,టిడిపి నాయకులు అరసవల్లి ఉమా మహేశ్వర రావు,ఎంపీటీసీ చిట్టి బాబు, అఖిల్,గోవింద పాపారావు,కార్ని రమణ, వంక రామారావు,సూల శాంత రావు,కొల్లి రమేష్,సైనీ,బాలాజీ, వైకుంతరావు, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

విశాలాంధ్ర-హిరమండలం: రాష్ట్ర కూటమి ప్రభుత్వం స్వర్ణంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని హిర మండలం తహసీల్దార్ ఎన్.హనుమంత్‌రావు అన్నారు. శనివారం హిరమండలం మేజర్ పంచాయతీలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమమును ర్యాలీ ద్వారా నిర్వహించారు. ఈ సందర్బంగా తహసీల్దార్ హనుమంత్‌రావు మాట్లాడుతూ ఈ వ్యర్థలా ప్రత్యేక నిర్వహణ కార్యక్రమంలో భాగంగా ఇళ్ళు, హాస్పిటల్‌లు, ప్రభుత్వం కార్యాలయలు, ప్రవేట్ సంస్థలు నుంచి ఉత్పన్న మయ్యే కంప్యూటర్ లు, టీవీ లు, మొబైల్ ఫోన్ లు, సౌండ్ బాక్స్ లు మొదలగు వస్తువులను పర్యావరణ హితంగా నిర్వహించడం ద్వారా రీ సైక్లింగ్ చేయండముపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబుల్యూ ఎస్ ఎ ఈ ఈ ఎ సాగర్, హిర మండలం పంచాయతీ ఈఓ, జూనియర్ సహాయకులు డి వర కార్తీక్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఉమా మహేశ్వర రావు, ఎంపీటీసీ తల్ల శంకర్ రావు సచివాలయ సిబ్బంది, పంచాయతీ శానిటేషన్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్రలో అందరి భాగస్వామ్యం అవసరం

- పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస: స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్క రూ భాగస్వామ్యం కావాలని ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ పిలుపునిచ్చారు. ఆముదాలవలస మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర పై శని వారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సం దర్భంగా పరిసరాల పరిశు భ్రత పై పట్టణ వాసుల కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ఆమదాలవలస పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తన వంతు ప్రయ త్నాన్ని చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టణ అభి వృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులను విడు దల చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మున్సి పాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకారాన్ని అందజేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో చెత్తకు పన్ను వేసే జీవోను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్త పై పన్నును తొలగిస్తూ జీవోను విడుదల చేసి నట్లు తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రతి ఒక్కరూ భావించి పరిసరాల పరిశుభ్రత నాంది పలకాలన్నారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలియ జేశారు. ఈ కార్యక్రమం వలన పారిశుద్ధ్యం మెరు గుపరచడం వలన పరిసరాల పరిశుభ్రత జరుగు తుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమి షనర్ పూజారి బాలాజీ ప్రసాద్, ఆర్ఐ గోవింద రావు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ తమ్మినేని గీత, టిడిపి జిల్లా కార్యదర్శి మొదలవలస రమేష్, టిడిపి జిల్లా పార్లమెంటరీ డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ చాపర సుధాకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పలాసలో నీలంబట్టి మాయం..!

విశాలాంధ్ర - పలాస: పలాస నియోజకవర్గంలో పలాస, వజ్రపుకొత్తూరు,మందస మండలాలతో పాటు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో కొంతమంది అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన చోటా నాయకులు, స్థిరాస్తి వ్యాపారుల కన్ను పడిన ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులు మాయమైపోతున్నాయి. ఆక్రమణలతో చెరువులు బక్క చిక్కిపోతున్నాయి. కొండ కాలువలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. మొత్తంగా సాగునీటి వనరులకు, భూగర్భ జలాలకు ముప్పును తెచ్చిపెడుతున్నాయి. ప్రజలు, రైతులు కష్టాలు గురించి ఆలోచించకుండా కాసులకు ఆశపడి సహజ వనరులను దోచుకుంటున్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఈ తరహా బరితెగింపు వ్యవహారాలు గత 12 ఏళ్లుగా పెరుగుతున్న అధికారుల నుంచి స్పందన కనిపించడమే లేదు. ఫిర్యాదు చేస్తే తిరిగి ఆక్రమణదారులతో సెటిల్ మెంట్లు చేసుకోవాలని ఉచిత సలహాలు ఇస్తుంటారు. కాగా కొంతమంది ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ భూములు, చెరువులు కాలువలు కనుమరుగైపోతున్నాయి. ఆ కోవలోకే వస్తుంది సర్వే నెంబర్ 32 లో గల నీలంబట్టి.. ప్రస్తుత జనరేషన్ ఈ బట్టి విషయం తెలియకపోయిన తాత తండ్రులకు నీలంబట్టి ఉందనేది గుర్తుగానే ఉంటుంది. ప్రస్తుతం ఈ బట్టి నామరూపాలు లేకుండా మాయమైపోయింది. పలాస కాశీబుగ్గ జంట పట్టణాలకు కంఠాభరణాలుగా ఉన్న సూదికొండ, నెమలికొండ దిగువ భాగం బట్టి ద్వారా వర్షపు నీరు పల్లపు ప్రాంతానికి ప్రవహించేది. రెండు కొండల మధ్యలో ఉన్న కాలువ ద్వారా ఎర్ర చెరువుకు, ముత్యాలమ్మ కోనేరుకు, నీలంబట్టి ద్వారా దేవర చెరువు, జగన్నాథ సాగరంలోకి వర్షపు నీరు ప్రవహించేది. రైతులకు సాగునీరు, భూగర్భ జలాలకు ఉపకరించేది. నీలంబట్టి ద్వారా ఐటిఐ పక్కన, లేబర్ కాలనీ, ఆర్టిసి కాంప్లెక్స్ మీదుగా ముత్యాలమ్మ కోనేరు సమీపంలో ఉన్న కాలువ ద్వారా నీరు ప్రవహించేది. అయితే ప్రస్తుతం కేటి రోడ్డు ఆనుకొని ఉన్న నీలం బట్టి కాలువ పూర్తిగా ఆక్రమణలదారుల చేతిలో చిక్కుకుంది. కాలువ ఎగువ ప్రాంతంలో పెద్ద పెద్ద భవనాలు వెలిశాయి. దీనివలన ముత్యాలమ్మ కోనేరు, దేవర చెరువుకు నీటి గండం ఏర్పడింది. ఎడారిగా మారిపోయింది. దేవర చెరువు భూగర్భం కబ్జాలకు గురయ్యాయి. వందలాది ఎకరాల్లో ఉన్న జగన్నాథ సాగరం భూభాగం కూడా ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్లు ప్రారంభమై చెరువు భూములను ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్మకాలు జరిపి డబ్బులు చేసుకున్నారు. చెరువు గర్భాల్లో, నీరు ప్రవహించే కాలువల్లో ఎలాంటి ఆక్రమణలు ఉన్న ఏమాత్రం ఉపేక్షించకుండా వెంటనే తొలగించాలని దేశ ఉన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సంబంధిత అధికారుల్లో చలనం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారమే ఇటీవల తెలంగాణ రాజధాని హైదరాబాదులో 'హైడ్రా' పేరుతో ఆక్రమణలను తొలగించే విధంగా పలాస కాశీబుగ్గ ప్రాంతంలో 'పైడ్రా' పేరుతో నీటి నిల్వ ఉన్న కాలువలు, చెరువులు ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల ఒక ప్రకటన చేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువల కబ్జాలు తొలగించేందుకు దృష్టి సారించారు. జిల్లా కేంద్రాల్లో కబ్జాలపై వినతి పత్రాలు స్వీకరిస్తామని ప్రకటించారు. దీని ప్రకారం భవిష్యత్తులో ప్రభుత్వ భూముల ఆక్రమణలు కబ్జాలు తొలగిపోయే ఆనందకరమైన పరిస్థితులు దూరంగా కనిపిస్తున్నాయి.

బోరుభద్ర ఉన్నత పాఠశాలకు మైక్ సెట్, టెంట్స్ వితరణ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గన్నవరపు గోవిందరావు తన తల్లిదండ్రులైన గన్నవరపు మల్లేసు, తవిటమ్మల జ్ఞాపకార్థం ఖరీదైన రెండు టెంట్స్(షామియానా)లను శనివారం బహుకరించారు. ఇదే పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయిలలో స్థిరపడిన శ్రీకృష్ణాపురానికి చెందిన పూర్వ విద్యార్థులు అత్యాధునిక సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు పి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం, ఆరంగి రామారావు, అప్పిని వెంకటేష్, వసంతరావు, ముద్దపు రమణలు మాట్లాడుతూ విద్యాపరంగా దినదినాభివృద్ధి చెందుతున్న పాఠశాలలో అన్ని మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గన్నవరపు గోవిందరావు, ఉపాధ్యాయులు బాడాన ఉదయ్ కుమార్, బాడాన శ్రీనివాసరావు, బాడాన ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు టి.లోకేశ్వర రావు, డి.ఉమాశంకరరావు, వెంకట రెడ్డి, కె.త్రినాథరావు, బాడాన రాజు, డి. ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయలక్ష్మి, బి.నాగమణి, కె.తవిటి రెడ్డి, బి.రజని, జి.జగదాంబ, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతి రావు, శంకర రావు, గోపాల రెడ్డి, త్రివేణి పాల్గొన్నారు.

సర్పంచ్ అసమర్ధతతోనే పంచాయతీ అభివృద్ధి శూన్యం

- ప్రతిపక్ష నేతను దూషించడం తగదు

విశాలాంధ్ర-కవిటి: లండారిపుట్టుగ పంచాయతీని అభివృద్ధి చేయలేకపోవడం సర్పంచ్ అసమర్థతే కారణమని లండారిపుట్టుగ పంచాయతీ చెందిన రామస్వామి, నీలకంఠం, ఆనంద్, చంద్రయ్య, బాలు, వెంకటరావు తదితరులు ఎద్దేవా చేశారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు.తన అసమర్థతను ఇతరుల మీద వేయడం లేదా తన తప్పును ఒప్పుకోకుండా ఎదుటి వారిని నిందించడం సరికాదన్నారు. సర్పంచ్ గా ఎన్నికై, మరో 10 మాసాలలో తన పదవీ కాలాన్ని పూర్తి చేసుకుని, వెనక్కి తిరిగి చూస్తే ఒక్క పనిని కూడా సరిగ్గా చేయలేక, దానికి కారణం ఇతరులని నిందించడం చూస్తుంటే ఆయన పనితనాన్ని అర్థం చేసుకోవచ్చని అన్నారు. అధికార పార్టీకి మద్దతు సర్పంచిగా ఉంటూ, ప్రతిపక్ష నేత తన అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆయన మాట్లాడిన తీరు పరిశీలిస్తే ఆయనొక రాజకీయ అజ్ఞాని అని అభివర్ణించక తప్పట్లేదని ఈ సందర్భంగా వాళ్లు అన్నారు. ఉపాధి హామీ పథకం పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మా సర్పంచ్ కు అధికారులు పిలవలేదంటే మా సర్పంచ్ పరపతి కూటమి ప్రభుత్వంలో ఏరకంగా ఉందో ఆయనే స్వయంగా మీడియా సమావేశం పెట్టి మరి వివరించారని తెలిపారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు, ఎదుటి వ్యక్తి వారిపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అభివృద్ధిలో పోటీపడాలి తప్పిస్తే, నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని కౌంటర్ ఇచ్చారు. మరోసారి స్థానిక సంస్థలు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో, పంచాయతీ ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం చేస్తున్నట్టు ఈ వ్యవహారం ఉందని, ప్రజలు అంత అమాయకులేమీ కారని అన్నారు.

తల్లిదండ్రులు సహకరిస్తే పాఠశాలలు బలోపేతం

విశాలాంధ్ర-కవిటి: తల్లిదండ్రుల సహకరిస్తేనే ప్రభుత్వ పాఠశాలలో బలవపేతం దిశగా అడుగులు వేస్తాయని హెచ్ఎం బల్లెడ బాబురావు అన్నారు. ఈ మేరకు శనివారం బి.గొనపపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు,గ్రామస్తులు, యువత సహకరిస్తే గ్రామీణ ప్రాంత పాఠశాలలు బలోపేతం అవుతాయని దీనికి తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక సర్పంచ్ బద్రి ప్రకాష్ మాట్లాడుతూ గ్రామస్తులు అందరం సంఘటితంగా గ్రామాలలో పర్యటనలు చేసి పాఠశాలలో విద్యార్థులను చేర్పించి బలోపేతం చేద్దామని అన్నారు. మాజీ ఎంపీటీసీ,మాజీ చైర్మన్ సర్వేశ్వరరావు మాట్లాడుతూ మనందరం సంఘటితంగా ముందుకు వెళ్తే పాఠశాలలో సునాయాసంగా బలోపేతం అవుతాయని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ వంటలను పరిశీలించి వారికి తగిన సూచనలు ఇచ్చారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి గ్రామస్తులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,ఎంపీటీసీ సభ్యులు పిరియా కృష్ణారావు, విద్యా కమిటీ చైర్మన్ బడగల జోగారావు, బెందాళం కృష్ణారావు, పూడి రామారావు, జగ్గు, సీతారాం, రామారావు, విజయలక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిండు గర్భిణీకి పురిటి నొప్పులు..

108లో తరలిస్తుండగా మార్గమధ్యంలో సుఖ ప్రసవం.!

విశాలాంధ్ర-మందస: మండలం బసుగాం గిరిజన గ్రామానికి చెందిన సవర.జయమ్మ అనే గర్భిణీకి శుక్రవారం అర్ధరాత్రి పురుటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. వెంటనే 108 సిబ్బంది గ్రామానికి చేరుకొని స్థానిక వైద్యుని సలహా మేరకు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది వాహనాన్ని రోడ్డు ప్రక్కన ఆపి, ప్రసవం చేయగా జయమ్మ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు అక్కడి వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలోని పలు గిరిజన ప్రాంతాలలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో గర్భిణీలు, ప్రమాదంలో ఉన్నవారికి అత్యవసర చికిత్సను అందించడం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుంది.

ఉన్నత అధికారులు దృష్టి సారించి గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్య సదుపాయాలు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.అనిత

విశాలాంధ్ర-మందస: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిణి డాక్టర్ వి.అనిత వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు రికార్డులను, ఆరోగ్య కేంద్రంలోని పరిసరాలు, అందుబాటులో ఉన్న మందులు, వ్యాక్సిలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్ర సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో మందస వైద్యాధికారి మద్దిల.సంపత్ రావు, ఈవో కృష్ణారావు, వైద్య సిబ్బంది పెంటమ్మ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రారంభించిన వైస్ సర్పంచ్ సాసుపల్లి

విశాలాంధ్ర-నరసన్నపేట: పట్టణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు శనివారం ప్రారంభించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు ఆదేశాలు మేరకు ప్రతీ నెలా 3వ శనివారం ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారన్నారు. ప్రతీ నెల 3వ శనివారం రోజు ఇ-చెక్ అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ సంధర్బంగా మేజర్ పంచాయితీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, బొడ్డేపల్లి మధుసూధనరావు, పంచాయితీ ఈఓ, వి.ద్రాక్షాయిణి, ఈఎసిఆర్‌డి, రేణుక, టిడిపి నాయకులు, గొద్దు చిట్టిబాబు, పీస కృష్ణ, వారణాశి రమేష్, పంచాయితీ కార్యాలయ సిబ్బంది, పంచాయితీ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

జోగారావు కుటుంబానికి ఎంపీపీ పరామర్శ

విశాలాంధ్ర-సోంపేట: మాతృవియోగానికి గురైన పలాసపురం సర్పంచ్ తడక జోగారావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, వైకాపా సీనియర్ నేత ఇప్పిలి కృష్ణారావు శనివారం పరామర్శించారు. ఆయనతో పాటు మండల వైసీపీ కన్వీనర్ శిలగాన భాస్కరరావు కూడా హాజరయ్యారు. మృతి చెందిన అన్నపూర్ణమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. జోగారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అగ్నిమాపక అధికారి అశోక్

విశాలాంధ్ర-రణస్థలం: ఫైర్ వారోత్సవాలలో భాగం శనివారం హాస్పిటల్ సేఫ్టీ లో భాగం గా గ్లోబల్ స్పెషాలిటీ హాస్పిటల్, పైడిభీమవరం నందు హాస్పిటల్ లో ఫైర్ వలన అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి, అగ్ని ప్రమాదాలు జరిగినపుడు వాటిని ఎలా నివారించాలి మరియు ప్రమాదం జారకుండా వారు తీసుకునే జాగ్రత్తలు గురించి వివరించి అగ్నిమపాక సిబ్బంది హాస్పిటల్ సిబ్బంది తో డ్రై కెమికల్ పౌడర్ ఎజ్టింగ్ యూజర్, సీవో2 ఆర్పేది ఎలా ఉపయోగించాలని డెమో చేసి హాస్పిటల్ సిబ్బంది అందరికి అవగాహన కల్పించడమైనది మరియు వారితో డెమో చేపించటం జరిగినది. ఈ సందర్భంగా రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్ మాట్లాడుతూ అప్రమత్తంతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని ప్రజలు కోరారు చివరగా ఫైర్ సేఫ్టీ నకు సంబందించిన కరపత్రాలు అందజేశారు.

శ్రీముఖలింగంలో పోషణ పక్షోత్సవం

విశాలాంధ్ర-జలుమూరు: జలుమూరు మండలం శ్రీముఖలింగం అంగన్వాడి కేంద్రంలో శనివారం పోషణ పక్షోత్సవ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా అంగనవాడి కార్యకర్తలు చంద్రకళ మాలతి దేవి భవాని మాట్లాడుతూ పిల్లల్లో పౌష్టికాహారం పెంచడం గర్భిణీ బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పలు విషయాలను వారు వివరించారు వీటితోపాటు పిల్లల తల్లిదండ్రులు పలువురు పాల్గొన్నారు.

జాడుపూడిలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

విశాలాంధ్ర-కంచిలి: కంచిలి మండలం జాడుపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అద్భుతంగా చేపట్టారు ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ తిరుమలరావు మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంటే మన ఆరోగ్యం కూడా బాగుంటుంది అని చెప్పారు అంతరం ఎంఈఓ శివరాం ప్రసాద్ తో కలిసి గ్రామం లో అన్ని ప్రదేశాలను శుభ్ర పరుస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలానే స్థానిక పాఠశాల విద్యార్థుల తో గ్రామం లో ర్యాలీ నిర్వహించారు. తరువాత వాళ్ళతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది. కంచిలి అగ్రికల్చర్ ఆఫీసర్ ధనంజయ రావు. అలానే గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

విశాలాంధ్ర-నందిగాం: మన పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకుందామని ఎంపీడీవో టి రాజారావు అన్నారు నందిగామలో గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పెద్ద తామరపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు స్వచ్ఛ దివస్ నినాదాలు చేపట్టారు.

దర్జాగా మట్టి కంకర అక్రమ రవాణా..

కొరవడిన అధికారుల నిఘా..!

విశాలాంధ్ర-పలాస/మందస: పలాస నియోజకవర్గంలో కాంట్రాక్టర్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మట్టి కంకర ఇసుక రాయి కాసుల సంపాదనకు ఓ వరంలా తయారైంది. ఎక్కడికక్కడ ప్రభుత్వ వనరులను, ప్రకృతి సంపదలను కొల్లగొడుతున్నారు. దీనిపై నిఘా కొరబడుతుంది. అక్రమ కంకర రవాణాపై చర్యలు తీసుకునే శాఖలకు వీరి నుంచి పుష్కలంగా డబ్బులు దొరుకుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇటువంటి అక్రమ వ్యాపారానికి అడ్డు అదుపు లేకుండా పోయింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పలాస నియోజకవర్గం పరిధిలోని పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పలాస, మందస,వజ్రపుకొత్తూరు మండలాల్లో రెవిన్యూ, అటవీ శాఖ, ఇరిగేషన్ పంచాయతీరాజ్ గనుల శాఖలకు చెందిన భూములు, కొండలు నుంచి కంకర మట్టిరాయి అక్రమంగా తరలిపోతుంది.బాహాటంగా తరలిపోతు న్నప్పటికీ సంబంధిత శాఖలు చోద్యం చూస్తున్నాయి. మందస మండలం పరిధిలో ఉన్న మహేంద్ర తనయ నదికి ఆనుకుని గౌడు గురంటి,చిన్న కోస్తా, భోగాపురం, సిరిపురం పొత్తంగి,బెల్లుపటియా సుండి పూడి పింపిడియా, ములిపాడు, కొత్తపల్లి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల మీదుగా మహేంద్ర తనయ నది ఇసుక లారీల్లోనూ ట్రాక్టర్ ద్వారా అక్రమంగా తరలిపోతుంది. అనేక మంది వ్యాపారులు ఇసుక నిల్వలు చేసి అమ్మకాలు చేస్తున్నారు. మందస అటవీ ప్రాంతంలోని కొండల నుంచి రాయి కంకర, అంబుగాం, సువర్ణపురం, మకరజోల, బాలిగాం, మందస పంచాయతి పరిధిలో ఉన్న చెరువుల నుంచి మట్టి తరలిపోతుంది. వ్యాపారులు కాంట్రాక్టర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తవ్వేస్తున్నారు. బైరి సారంగపురం పంచాయతీల పరిధిలో ఉన్న స్మశాన స్థలాలను పంచాయతీ స్థలాలను కబ్జా చేసి కంకరను తవ్వి తరలిస్తున్నారు. పిడి మందస పంచాయతీ పరిధిలో ఉన్న సుమారు 100 ఎకరాల విస్తీర్ణం గల బల్లూక గిరి కొండను వ్యాపారులు కొల్లగొడుతున్నారు.ఈ కొండ నుంచి రాయి కంకరను తరలిస్తున్నారు. అలాగే వజ్రపుకొత్తూరు మండలంలో బెండి కొండ, సీతాపురం, మురహరిపురం కొండ, తాడివాడ ప్రాంతాల్లో కంకర మట్టిని రాత్రనకా పగలనకా అక్రమంగా తరలించుకుపోతున్నారు. పలాస ప్రాంతంలో కోసంగిపురం, నెమలికొండ, సూది కొండ ప్రాంతాల్లో కంకరను తవ్వుకుపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో యదేచ్ఛగా కంకర, మట్టి ని అక్రమంగా తరలిస్తున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు దాడులు చేసి ఒకటి.. అర.. వాహనాలను సీజ్ చేసి అపరాధ రుసుము వసూలు చేసిన అలవాటు పడ్డ అక్రమ వ్యాపారులు తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇప్పటికైనా వారిపై నిఘా పెట్టి కంకర మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జేఈఈ మెయిన్స్లో సత్తా చాటిన విక్రమరాజా

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని అల్లినగరం గ్రామానికి చెందిన బుడుమూరు విక్రమరాజా అనే విద్యార్థి ఎన్టీఏ జాతీయ స్థాయిలో ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తా చాటాడు. ఈ విద్యార్థి 100కు 99.9976 మార్కులు సాధించి ఓపెన్లో 64లో, ఓబీసీ కేటగిరీలో ఆరో ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి విశాఖపట్నంలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ సీబీఎస్ సిలబస్లోలో చదవగా, ఇంకా ఫలితాలు రావల్సిఉంది. ముంబాయి ఐఐటీలో సీఎస్ఈ బ్రాంచ్లో ఇంజనీరింగ్ పూర్తిచేయాలన్నదే తన లక్ష్యమని విక్రమరాజా తెలిపారు. ఈయన తండ్రి సోమరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి కళ్యాణి స్థానికంగా ఓ ప్రైవేటు స్కూల్ను నిర్వహిస్తున్నారు.

21న ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి పరీక్ష

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం కుప్పిలి ఆదర్శ పాఠశాల/ కళాశాలలో ఆరో తరగతిలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 21వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.అప్పాజీరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని, ఉదయం 9 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి హాజరుకావాలన్నారు. దరఖాస్తు చేసి విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ సీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్సైట్లో హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. హాల్ టికెట్, గుర్తింపు కార్డు, నీలం లేదా నలుపు పెన్నులతో విద్యార్థులు హాజరుకావాలన్నారు.

కమిషనర్ తో చర్చలు సఫలం.. విధుల్లోకి ఆర్పీలు

విశాలాంధ్ర -పలాస: పలాస కాశీబుగ్గ పురపాలక సంఘానికి సంబంధించి, మెప్మా విభాగానికి చెందిన రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ) గత 10 నుండి, జీతాల పెంపు, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల సాధన కొరకై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలలో భాగంగా విధులను బహిష్కరించిన నేపథ్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆర్.పి. లను చర్చలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ మరియు మెప్మా కు సంబంధించిన ఉన్నతాధికారులతో చర్చించి ఆర్ పి ల సమస్యలను పలాస శాసనసభ్యులు గౌతు శిరీష ద్వారా నివేదించుకోవాలని సూచించారు. అంత వరకు తమ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు.ప్రభుత్వంతో ఘర్షణాత్మక వైఖరి సరికాదని, డ్వాక్రా సంఘాలకు తద్వారా సమాజానికి ఆర్ పి లు అందిస్తున్న సేవల పట్ల ప్రభుత్వానికి సదభిప్రాయమే ఉందన్నారు. విధులను నిర్వహిస్తూనే సమస్యలుంటే శాంతి యుతంగా పరిష్కరించుకోవాలని కమిషనర్ కోరారు. ఈ విషయమై ఆర్.పి.లు ఏకగ్రీవంగా తమ అంగీకారాన్ని తెలిపి తమ విధులలో చేరారన్నారు. ఈ చర్చల్లో సీ.యం.యం. తదితర అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బగ్గు ..

విశాలాంధ్ర-జలుమూరు: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ నగరాలుస్వచ్ఛ గ్రామాలు స్వచ్ఛ అంధ్రాస్వచ్ఛభారత్ లో భాగంగా ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెలా మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఏప్రిల్ మూడో శనివారం ఇ -చెక్ అనే థీమ్ తో స్వచ్ఛ అంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఉపాధి హామీ వేతనదారులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ర్యాలీగా వెళ్లి ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నరసన్నపేట శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్రలో భాగంగా ఈ - వ్యర్థాల ప్రత్యేక నిర్వహణ కార్యక్రమం లో భాగంగా ఇండ్లు హాస్పిటల్స్ ప్రభుత్వ కార్యాలయాలుప్రైవేట్ సంస్థల నుండి ఉత్పన్నమయ్యే కంప్యూటర్లుటీవీలు, రేడియో మొబైల్ ఫోన్ లువాషింగ్ మిషన్లు మైక్రో ఓవెన్లు,సిడి ప్లేయర్లుఫ్యాన్లు మొదలగు వస్తువులను పర్యావరణ హితంగా నిర్వహించడం ద్వారా రీసైక్లింగ్ చేయడంపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి అడిషనల్ డిఎంహెచ్ఓ తాడేల శ్రీకాంత్ ఎంపీడీవో కే అప్పలనాయుడు తాసిల్దార్ జె రామారావు స్థానిక వైద్యాధికారిని జలుమూరు ఏఎంసీ చైర్మన్ తత్ర బలరాం లింగాలవలస చల్లవానిపేట సర్పంచులు దుంగ స్వామి బాబు పంచ్ రెడ్డి రామచంద్రరావు ఆ పార్టీ సీనియర్ నేతలు అక్కా జోషుల ఉమా దత్తుబాబు వెలమల రాజేంద్రనాయుడు గురుబిల్లి ఝాన్సీ రాణి పలువురు కార్యకర్తలు అధికారులు అభిమానులు పాల్గొన్నారు.

స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, తదితరులు

సాగునీరు సరఫరాకు పనులు ప్రతిపాదించాలి

ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: వచ్చే ఖరీఫ్ నాటికి నారాయణపురం కుడి కాలువ ద్వారా సాగునీటి సరఫరాకు అవసరమైన పనులను ప్రతిపాదిం చాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. కూటమి నేతలు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నారాయణపురం కాల వను శనివారం ఆయన పరిశీలించారు. నారాయణపురం ఆనకట్ట వద్ద, అలాగే ఆనకట్ట నుంచి 1 కిలో మీటరు వరకు ఉన్న ఇసుక మేటలను తొలగించాలన్నారు. మంతెన, గోకర్ణపల్లి వద్ద గుర్రపు డెక్కను తొలగించాలన్నారు. సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల పరిధిలో కాలువను ఆయన పరిశీలించి తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన పనులకు అంచనాలు రూపొందించాలన్నారు. ఈ నెల 22న జిల్లాను సందర్శించనున్న రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి కాలువ పనులు జరిగేలా కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈఈ రవీంద్రనాయుడు, ఏఈ కె.రాంబాబ జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యకుడు పైడి వేణుగోపాలం, మండల టీడీపీ అధ్యక్షుడు బెందు మల్లేశ్వరావు, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు పంచిరెడ్డి సత్యనారాయణ, సంపతిరావు నాగేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి, వావిలపల్లి రామకృష్ణ, పైడి ముఖలింగం, గూరు జగపతిబాబు, కొత్తకోట అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం...

ఎస్.ఆర్.ఐ. మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థి ఆత్మహత్యపై గంటా

విశాలాంధ్ర-భీమిలి : తగరపువలస, ఏప్రిల్ 19:బి ఎస్.ఆర్.ఐ. మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం విద్యార్థి శ్రీ రామ్ దత్త ప్రణీత్ ఆత్మహత్యపై దర్యాప్తు చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. శనివారం మెడికల్ కాలేజీ మార్చురీలో విద్యార్థి మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సమాజంలో అత్యున్నతమైన వైద్య వృత్తిని అభ్యసిస్తున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ఇన్విజిలేటర్ ఓ.ఎం.ఆర్. షీట్ తీసుకున్నారని, విద్యార్థి ప్రాధేయపడినా వినలేదని తోటి విద్యార్థులు చెబుతున్నారన్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి దూకినప్పుడు ఆపడానికి ప్రయత్నించినా రక్షించలేకపోయామని చెప్పారని వివరించారు. మొత్తం సంఘటన సీసీ ఫుటేజ్ లో నిక్షిప్తమై ఉన్నందున పూర్తి స్థాయి దర్యాప్తు చేయిస్తామని చెప్పారు. గతంలో కూడా ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఇంత జరిగినా యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేస్తున్నారని, కారణాలు వెల్లడైన తర్వాత చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు ప్రతి ఒక్కరూ ఖండించాలని, విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.